సాక్షి నంద్యాల

శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి గురువారం కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటి విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



108లో మహిళ ప్రసవం

బేతంచెర్ల: గోర్లగుట్ట గ్రామానికి చెందిన గర్భిణి నాగేశ్వరిని 108లో బేతంచెర్లకు తరలిస్తుండగా మార్గమధ్యలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు.




నంద్యాలలో బాలోత్సవాలు

నంద్యాల మున్సిపల్ టౌన్‌హాల్‌లో గురువారం నంది బాలోత్సవాలు ప్రారంభమయ్యాయి. క్లాసికల్ డ్యాన్స్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

8లో▸

ఇంటింటికీ ఆరోగ్య'సిరి'

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై అవగాహన కార్యక్రమాలు షురూ
- జిల్లాకు 5.35 లక్షల బ్రోచర్స్ మంజూరు
- ఇంటింటికీ వైద్య సిబ్బంది, వలంటీర్లు
- ఆరోగ్యశ్రీ, సిటిజన్ యాప్‌లపై విశదీకరణ
- అర్హులందరికీ కొత్త కార్డుల పంపిణీ



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు



కొత్తపల్లి మండలం పెద్ద గుమ్మాడాపురం గ్రామంలో గురువారం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: పేదల పాలిట సంజీవనిగా నిలిచిన డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం మరింత బలోపేతం అయ్యింది. ఈ పథకం కింద వ్యయ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మూడు వేలకు చికిత్సలను ఈ పథకంలో చేర్చింది. వైద్య ఆసరా కింద రోగి కోలుకునే వరకు ప్రతి నెలా రూ. 5 వేల వరకు సాయం అందజేస్తోంది. నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఖ్యను గణనీయంగా పెంచింది. అర్హులకు నూతన కార్డులను అందజేస్తోంది. ఎంతో విలువైన ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నుంచి జిల్లా, నియోజకవర్గ వ్యాప్తంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం గురించి ప్రజలకు వివరించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆరోగ్యశ్రీ అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరోగ్యశ్రీ సేవలను ఎలా పొందాలనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. నెల రోజుల పాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఆరోగ్యశ్రీ సేవల గురించి ప్రజలకు వివరిస్తారు. ఈ పథకానికి సంబంధించిన బ్రోచర్, కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా 5. 35 లక్షలు ఆరోగ్యశ్రీ బ్రోచర్లను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నియోజకవర్గంలో ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆరోగ్యశ్రీ బ్రోచర్లు, కరపత్రాలను చేర్చారు. అనారోగ్యం బారినపడినా, దురదృష్టవశాత్తూ ఏదైనా ప్రమాదం జరిగినా ఆరోగ్యశ్రీ కింద ఎలా చికిత్స పొందాలన్న దానిపై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తారు. ఆరోగ్యశ్రీ యాప్, సిటిజన్ యాప్ (ఆస్పత్రుల వివరాలు) వివరాలు తెలియజేస్తారు. ప్రభుత్వం అందజేసే బ్రోచర్‌లో ఆరోగ్యశ్రీ పథకం సేవలను ఎలా పొందాలి, ఏ సేవలు ఉంటాయి, వంటి అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారు.

చికిత్స పరిమితి పెంపు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దేశంలో ఎక్కడ లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని మొట్టమొదటి సారిగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రవేశపెట్టారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఆరోగ్యశ్రీ పథకానికి పునర్జీవం పోశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించి 1059 ఉన్న ఆరోగ్యశ్రీ చికిత్సలను 3,255కు పెంచారు. వైద్యం ఖర్చు రూ. వెయ్యి దాటే ప్రతి ప్రొసీజర్ను ఆరోగ్యశ్రీ పథకంలోకి తీసుకొచ్చారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కరోనా,



పాములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బ్లాక్ ఫంగస్, మిస్-సీ వంటి జబ్బులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలోకి తీసుకొచ్చారు. అన్ని రకాల క్యాన్సర్స్‌ను ఆరోగ్యశ్రీలోకి తీసుకొచ్చి పరిమితి లేకుండా ఎంత ఖర్చు అయినా ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను గణనీయంగా పెంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లోని సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఉచిత వైద్యం అందిస్తున్నారు. ఆపరేషన్‌ల అనంతరం కోలుకునే వరకు ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి రోజు రూ. 225 చొప్పున అందిస్తున్నారు.

రూ. 115.69 కోట్ల వ్యయం

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద సేవలందిస్తున్న ఆస్పత్రులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తూ పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2020-21లో 29,730 వైద్య సేవలకు రూ.16.37కోట్లు, 2021-22లో 61,295 మంది వైద్య సేవలకు రూ.28.76కోట్లు చెల్లించారు. 2022-23లో 86,953 మందికి రూ.44.12కోట్లు, 2023-24లో 52,721 మందికి రూ.26.44కోట్లు మొత్తం 2,30,699 మంది వైద్య సేవలకు రూ.115.69 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.

జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ కార్డుల వివరాలు

మండలం	ఆరోగ్యశ్రీ కార్డులు
ఆళ్లగడ్డ	11,743
ఆత్మకూరు	18,995
బనగానపల్లె	30,827
బేతంచెర్ల	26,775
చాగలమర్రి	15,514
డోన్	19,697
దొర్నిపాడు	8,325
గడివేముల	13,851
గోస్పాడు	12,812
జూపాడుబంగ్లా	12,136
కోవెలకుంట్ల	13,949
కొలిమిగుండ్ల	15,768
కొత్తపల్లి	10,113
మహానంది	12,056
మిడుతూరు	13,715
నందికొట్కూరు	11,715
నంద్యాల	20,715
అవుకు	16,120
పగిడ్యాల	11,138
పాములపాడు	13,714
పాణ్యం	15,064
ప్యాపిలి	21,602
రుద్రవరం	15,025
సంజామల	12,090
శిరివెళ్ల	17,944
ఉయ్యాలవాడ	9,101
వెలుగోడు	15,648
బండి ఆత్మకూరు	15,493
పట్టణాల వారీగా..	
ఆత్మకూరు	11,936
ఆళ్లగడ్డ	11,410
డోన్	15,417
నందికొట్కూరు	13 536
నంద్యాల	51,135

ఆరోగ్యశ్రీ పేదలకు వరం



ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య చికిత్స చేయించుకోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని. పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ మంచి వైద్య చికిత్సలు, మందులు ఉచితంగా అందజేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం కింద మరిన్ని సేవలు అందించడం వరం. ఆరోగ్యశ్రీ గురించి అవగాహన కల్పించడంతో సేవలు సులువుగా పొందే అవకాశం ఉంటుంది.

– కోళ్ల వరలక్ష్మి పెద్ద గుమ్మాడాపురం, కొత్తపల్లి మండలం

సేవల గురించి వివరిస్తారు



జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం గురించి వివరించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. పథకంపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్‌లకు పంపిణీ చేశాం. జిల్లాలో 15 సీహెచ్‌లు, 52 పీహెచ్‌సీలు, డెంటల్ ఆసుపత్రిల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందుతున్నాయి. ఏఎన్ఎం ఒక్కో ఇంట్లో 15 నిమిషాల పాటు పథకంపై అవగాహన కల్పించి వారి సెల్‌ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తారు.

– డాక్టర్ రూపేంద్రనాథరెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

న్యూస్‌రీల్

మద్దిలేటయ్య హుండీ ఆదాయం రూ.40.81 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి భక్తుల కానుకలు, ముడుపుల ద్వారా రూ. 40.81 లక్షల ఆదాయం వచ్చింది. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడు ఆధ్వర్యంలో44 రోజులకు సంబంధించి హుండీ కానుకల లెక్కింపును గురువారం చేపట్టారు. రూ. 40,81,010 నగదు, 26 గ్రాముల బంగారం , 2.400 కిలోల వెండి వచ్చింది. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు లక్ష్మీనాయుడు, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక ఓటరు జాబితాకు చర్యలు తీసుకోండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: పారదర్శకమైన జిల్లా ఓటరు జాబితా రూపకల్పనకు సంబంధించి స్వీకరించిన క్లెయిమ్స్, అభ్యంతరాలను వెంటనే క్లియర్ చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఈఆర్ఓ, ఏఈఆర్వోలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8లో ఉన్న 924 దరఖాస్తులను నాణ్యతతో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎన్నికల విధులలో నిర్లక్ష్యం పనికిరాదని, భారత ఎన్నికల సంఘం సూచించిన ఆదేశాలను తప్పక అనుసరిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. నంద్యాల పట్టణంలో ఓటర్ల సవరణకు సంబంధించి అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రత్యేక తీసుకొని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీఓలు శ్రీనివాసులు, ఎం.దాసు, వెంకటరెడ్డి, అన్ని నియోజకవర్గాల ఏఈఆర్వోలు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం గ్రామోత్సవం



మాడ వీధుల్లో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉత్సవమూర్తులైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వామితోపాటు శ్రీ గోదాదేవి అమ్మవారిని యాగశాలలో కొలువుంచి వేదమంత్రోచ్చారణతో నవకళశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం, అర్చన నిర్వహించి ఉత్సవ మూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తి గోదాదేవి అమ్మవారిని ప్రత్యేక గుడిలో కొలువైన మూలవిరాట్ గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కొలువుంచారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఎం.బసిరెడ్డి

డోన్ రూరల్: కొత్తకోట గ్రామం వద్ద నూతనంగా నిర్మిస్తున్న డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.బసిరెడ్డి గురువారం పరిశీలించారు. జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ నారాయణరెడ్డికి సూచించారు. ఆయన వెంట నంద్యాల డీటీఓ జి.వి.శివారెడ్డి, డోన్ ఎంవీఐ క్రాంతి కుమార్, ఆర్అండ్‌బీ జేఈ శ్రీకాంత్ ఉన్నారు.

ఉన్నత చదువులకు ప్రభుత్వ దీవెన

- వరుసగా నాలుగో త్రైమాసికానికి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్
- నేడు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ కానున్న 'విద్యా దీవెన' నిధులు
- జిల్లాలో 30,199 మంది విద్యార్థులకు రూ.21 కోట్ల మేర సాయం
- విద్యార్థుల్లో హర్షాతిరేకాలు



సాక్షి, నంద్యాల: ఉన్నత చదువులతోనే పేదరికాన్ని రూపుమాప వచ్చుననే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యారంగాభివృద్ధి పెద్దపీట వేశారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాకూడదనే లక్ష్యంతో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తూ వారి బంగారు భవితకు బాటలు వేస్తున్నారు. ఒకటో తరగతి మొదలు ఉన్నత చదువుల వరకు అండగా నిలిచేందుకు అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, నాడు - నేడు, జగనన్న గోరుముద్ద వంటి సంక్షేమ పథకాలను ఏటా అమలు చేస్తున్నారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి నేరుగా సాయం అందనుంది. జిల్లాకు సంబంధించి బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులు 30,199 మంది విద్యార్థులు పథకానికి అర్హత సాధించారు. వీరికి నాలుగో విడత సాయంగా శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి నగదు జమ చేయనున్నారు. చివరి త్రైమాసికానికి సంబంధించి రూ.21 కోట్ల మేర డబ్బులు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమకానున్నాయి. దీంతో కలిపి 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి మొత్తం రూ.85 కోట్ల మేర విద్యా దీవెన కింద ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది.

పూర్తి పారదర్శకంగా అమలు

విద్యాదీవెన కింద ప్రభుత్వం అర్హులైన ప్రతి విద్యార్థి తల్లికి నేరుగా ఆర్థిక సాయం అందజేస్తోంది. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ తదితర కోర్సుల విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కింద కోర్సును బట్టి రూ.15 వేల నుంచి రూ. లక్ష వరకు ఆర్థిక సాయం అందిస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ఏటా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాయాన్ని నేరుగా అందిస్తోంది. పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజు మొత్తాన్ని క్రమం తప్పకుండా ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమచేస్తోంది.

కేటగిరీల వారీగా చెల్లింపులు ఇలా...

కేటగిరీ	విద్యార్థులు	జమకానున్న నిధులు
ఎస్సీ	8,966	6,60,49,332
ఎస్టీ	912	54,10,673
బీసీ	10,882	7,23,64,826
ఈబీసీ	2,997	2,74,44,519
కాపు	2111	15,504,576
ముస్లిం మైనార్టీ	4,254	26,117,171
క్రిస్టియన్ మైనార్టీ	77	7,30,059
మొత్తం	30,199	21,36,21,156

పేద విద్యార్థులకు ఎంతో మేలు



రామక్రిష్ణ డిగ్రీ కాలేజీలో బీకాం కంప్యూటర్ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. కాలేజీ ఫీజు రూ.13 వేలను పూర్తిగా ప్రభుత్వమే అందిస్తోంది. ఇప్పటికే మా అమ్మ ఖాతాలో రూ.6,500 పడింది. నేడు మిగిలిన రూ.6,500 పడుతుందని చెబుతున్నారు. అలాగే వసతి దీవెన కింద రూ.20 వేలను ప్రభుత్వం అందజేసింది. ప్రభుత్వం అందజేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉచితంగా నేను చదువుకోగలుగుతున్నా. విద్యా దీవెన పథకం ప్రభుత్వ విద్యార్థులకు ఎంతో మేలు అవుతుంది.

– అమర్‌నాథ్ రెడ్డి, బీకాం ఫైనల్ ఇయర్, నంద్యాల

ఏడాదికి రూ.69 వేలు ప్రభుత్వం ఇస్తోంది



నేను బీటెక్ మెకానికల్ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. కాలేజీ ఫీజు ఏడాదికి రూ. 69 వేలను ప్రభుత్వమే నాలుగు విడతల్లో మా అమ్మ ఖాతాల్లో వేస్తోంది. ప్రతి త్రైమాసికం ముగుస్తానే రూ.17,275 చొప్పున పడుతోంది. వసతి దీవెన కింద సంవత్సరానికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. మా నాన్న వ్యవసాయం చేస్తూ మమ్మల్ని చదివిస్తున్నారు. ప్రభుత్వం పూర్తి ఫీజు అందజేయడంతోనే ఉన్నత చదువులు పూర్తి చేయగలుగుతున్నాం.

– తిలక్‌నాథ్ రెడ్డి, బీటెక్ ఫైనల్ ఇయర్, గోస్పాడు

మహిళల సుస్థిర జీవనోపాధికి చేయూత



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ మనజీర్ జిలానీ, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవి, కాటసాని రామిరెడ్డి, ఆర్థర్, గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ తదితరులు

- జనవరి నుంచి రూ.3 వేల పింఛన్
- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

నంద్యాల: మహిళల సుస్థిర జీవనోపాధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా, చేయూత పథకాలు అమలు చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ పెంపు, ఆసరా, చేయూత పథకాలపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నంద్యాల జిల్లా నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జల వనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, తొగురు ఆర్థర్, బిజేంద్రనాథరెడ్డి, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా పెన్షన్‌ను రూ.3వేలు చేస్తున్నారని, జనవరి 1వ తేదీ నుంచి లబ్ధిదారులకు ఇంటి వద్దకే వచ్చి వలంటీర్లు పింఛన్ అందజేస్తారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కసారి మాట ఇస్తే మాట తప్పరని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99.05 శాతం నెరవేర్చారన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో వైఎస్సార్ చేయూత, ఆసరా కార్యక్రమాల కింద నేరుగా మహిళల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారన్నారు. కరోనాతో ఆర్థికంగా ఇబ్బందులున్నా సంక్షేమాల పథకాల అమలను సీఎం జగన్ ఆపడం లేదన్నారు. సంక్షేమ పథకాల లబ్ధితో పాటు అభివృద్ధి పనులు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నడు లేనంతగా జిల్లాలో జరిగిందన్నారు. జనవరి నెలలో పెరిగిన పింఛన్‌తో పాటు ఆసరా, చేయూత కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

జనవరి 19లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదువుతున్న వారు వచ్చే నెల 19వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 5 నుంచి ఫీజులు చెల్లించే ప్రక్రియ మొదలు అవుతుందని పేర్కొన్నారు. ఒక సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుంతో వచ్చే నెల 20 నుంచి 27వ తేదీలోపు, రూ.50 అపరాధ రుసుంతో 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు, తాత్కాల్ కింద ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఫీజులు చెల్లించవచ్చునని తెలిపారు.

ఆరోగ్య సురక్ష ఫేజ్-2ను విజయవంతం చేద్దాం

- వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ రామనాథం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ రామనాథం


నంద్యాల టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ -2 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ రామనాథం సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై గురువారం స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లా నోడల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామనాథం మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రెండో విడత చేపడుతుందన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీ సర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అందరూ సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ జనవరి 2వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న 369 విలేజ్ క్లినిక్స్, 18 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఇందు కోసం 162 రకాల మందులు, 18 సర్జికల్ పరికరాలు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్స్, తదితరాలను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జగదీష్ చంద్ర రెడ్డి, ప్రసన్న లక్ష్మీ, కామేశ్వర్, సుజాత తదితర సిబ్బంది పాల్గొన్నారు.

జగనే మళ్లీ సీఎం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. ప్రభుత్వ సహాయంతో మేము ఆర్థికంగా కోలుకున్నాం. నేను పొదుపు గ్రూపులో సభ్యురాలుగా ఉన్నాను. పొదుపు మహిళలకు రుణమాఫీ చేయడం వల్ల నాకు విడతలు వారీగా మూడు విడతలుగా ఇప్పటి వరకు రూ.75 వేలు వైఎస్సార్ ఆసరా కింద వచ్చింది. అలాగే వైఎస్సార్ చేయూత కింద మూడు విడతలుగా రూ. 56 వేలు జమ కావడం జరిగింది సున్న వడ్డీ పథకంలో భాగంగా మరో రూ.5 వేలు వచ్చాయి. నాకు ముగ్గురు కూతుళ్లు. ఇద్దరికి పెళ్లిల్లు చేశాను. చిన్న కూతురు ఇటీవలే ఇంజినీరింగ్ పూర్తి చేసింది. నా బిడ్డకు విద్యా దీవెన పథకం కింద రూ.10 వేలు నా అకౌంట్‌లో జమ అయ్యాయి. నా భర్త నరసింహాలుకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ మొత్తంతో నేను ఇంటి వద్దనే చిన్నపాటి దుకాణం పెట్టుకొని జీవిస్తున్నాను. పేదల కోసం మంచి చేసే జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా గెలుస్తారనే నమ్మకం ఉంది.

– జయలక్ష్మి, కొండపేట, బనగానపల్లె



మట్టి మిద్దె కష్టాలు తొలగిపోయాయి



పాత చిన్న మట్టి మిద్దెలో కొన్నేళ్లుగా నివసించాం. వర్షా కాలం వస్తే పొటుకెత్తి ఇంట్లో నీరు నిలిచేది. వ్యవసాయ పనులకు వెళ్తూ జీవనం సాగించే మాకు కొత్త ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. కొన్నేళ్లు మట్టి మిద్దెలోనే కష్టాలు పడుతూ వచ్చాం. గతంలో ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం కోసం అధికారులు, నాయకులు చుట్టూ తిరిగినా ఎవరూ కరుణించలేదు. జగనన్న ప్రభుత్వంలో మాకు న్యాయం జరిగింది. ఎవరి సిఫారసు లేకుండానే ఇల్లు మంజూరైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సాయంతో సొంతింటి కల నెరవేరి మట్టి మిద్దె కష్టాలు తొలగిపోయాయి. పేదలకు గూడు కల్పించిన సీఎం వెంటే అందరూ ఉంటారు. – దూదేకుల దస్తగిరమ్మ, చిత్రేనిపల్లె, రుద్రవరం మండలం

క్లుప్తంగా

వైద్య ఆరోగ్యశాఖలో వాహనాల వేలం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో కాలపరిమితి తీరిన 13 వాహనాలకు వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి పొందినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. గురువారం ఆయన తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ–వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి నిర్ణయాధికారం తమ పరిధిలో ఉంటుందన్నారు. సమావేశంలో ఏవో అరుణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సునీల్, చీఫ్ మెకానికల్ ఇంజినీర్ సుధారాణి, సర్వీస్ ఇంజినీర్‌తారమోహన్‌రావు, డెమో ప్రమీలాదేవి పాల్గొన్నారు.

బావిలో పడి వీఆర్‌ఏ మృతి



వెంకటకృష్ణ మృతదేహం

ఓర్వకల్లు: మిడివేముల గ్రామ రెవెన్యూ సేవకుడు (వీఆర్‌ఏ) బోయ వెంకటకృష్ణ(32) బావిలో పడి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 26వ తేదీన బయటకు వెళ్లిన వెంకటకృష్ణ రాత్రయిన తిరిగి రాకపోవడంతో 27వ తేదీన ఆయన భార్య వెంకటేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా గ్రామ శివారులోని మద్దిలేటి నాయుడు అనే రైతుకు చెందిన బావి వద్ద చెట్టుపై దుస్తులు కనిపించాయి. అనుమానంతో బావిలో నీటిని బయటకు తోడించగా వెంకటకృష్ణ మృతదేహం కనిపించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురువారం ఉదయం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి మార్చురీకి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

హోరా హోరీగా..



దొర్నిపాడు ఉన్నత పాఠశాలలో ఖోఖో ఆడుతున్న బాలికలు



కర్నూలు బి.క్యాంప్ హైస్కూల్ గ్రౌండ్‌లో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



నంద్యాల పట్టణం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వాలీబాల్ ఆడుతున్న దృశ్యం



కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్న దృశ్యం

సిక్స్‌కు రూ. 200.. వికెట్‌కు రూ. 500



చాగలమర్రి సచివాలయ స్థాయి క్రికెట్ పోటీలో ప్రతిభ చాటిన క్రీడా కారులకు నగదు బహుమతిని అందజేస్తున్న అతిథులు

చాగలమర్రి: ఆడుదాం–ఆంధ్ర పోటీల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అధికారులు, నాయకులు నగదు బహుమతులు ప్రకటించి మరింత ఉత్సాహాన్ని నింపుతున్నారు. చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం జరిగిన క్రికెట్‌పోటీల సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు మహబూబ్‌షరీఫ్, ఎంపీటీసీ బబ్లూ క్రీడాకారులను ప్రోత్సహించటానికి ప్రతి సిక్స్‌కు రూ.200, వికెట్‌కు రూ.500 ప్రకటించారు. ఈ మేరకు ఆయా జట్లలోని రఫీ 2, ఇర్ఫాన్ 2, శివా 1 సిక్స్‌లు కొట్టి రూ.1,000 నగదు బహుమతిని అందుకున్నారు. అలాగే వికెట్ తీసిని మరో ముగ్గురికి రూ. 500 చొప్పున రూ.1,500 అందజేశారు.



క్రికెట్‌లో మెరిసిన కాశీం, సల్మాన్

మెరిసిన యువకులు

మద్దికెర: పెరవలి గ్రామంలో పెరవలి, హంప, బసినేపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని యువకులు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం జరిగిన క్రికెట్ పోటీల్లో మెరిసి తమ సత్తాను చాటారు. పింజరి కాశీం అనే యువకుడు 15 బంతుల్లో 46 పరుగులు సాధించాడు. అలాగే అదే జట్టులో సల్మాన్ 2 ఓవర్లలో మూడు వికెట్లు తీసి తమ జట్టు విజయానికి కారకులయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో జీజీ యూత్, ఆర్‌చాలెంజర్స్ బీ రెండు జట్లు పోటీ పడ్డాయి. జీజీ యూత్ నిర్ణీత పది ఓవర్లలో 74 పరుగులు సాధించగా ఆర్ చాలెంజర్స్ బీ 5.3 ఓవర్లలో 75 పరుగులు సాధించి విజయం సాధించారు. జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన యువకులను గ్రామస్తులు, అధికారులు అభినందించారు.



కృష్ణగిరి మండలం కంబాలపాడులో బ్యాడ్మింటన్ పోటీలు



కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో ..

పరుగుల వరద



నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణం 37వ వార్డు నందమూరి నగర్‌లో గురువారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో పరుగు సునామీ సృష్టించాడు సురేష్‌నాయక్. వార్డు సచివాలయ పరిధిలో జరిగిన క్రికెట్ పోటీలో 20 బంతుల్లో 70 పరుగులు సాధించాడు. ఇందులో 7 సిక్సర్లు, 4 ఫోర్లు, 7డబుల్స్, రెండు సింగల్స్ ఉన్నాయి. నందమూరి నగర్ టీమ్–1 ముందుగా బ్యాటింగ్ చేసి పది ఓవర్లలో 167 పరుగులు చేసి, నందమూరి నగర్ టీమ్–2ను 44 పరుగులకే ఆల్ అవుట్ చేసి గెలుపొందింది.

దొంగ అరెస్టు



దొంగను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: స్థానిక రోజా వీధిలోని వెంకట ముని సాయి మందుల దుకాణంలో ఈనెల 22న జరిగిన చోరీ ఘటనలో పక్కా ఆధారాలతో రెండవ పట్టణ పోలీసులు దొంగను అరెస్టు చేసి కటకటాలకు పంపారు. దుకాణం వెనుక వైపు తలుపులు తీసి దొంగ రూ.లక్ష అపహరించి పరారయ్యారు. దుకాణం యజమాని వరప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పాతబస్టాండ్ సమీపంలోని అజంతా హోటల్ వద్ద యువకుడు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.లక్ష నగదును రికవరీ చేసి రిమాండ్‌కు పంపినట్లు రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు.

గ్రామ సచివాలయాలతో బాల్య వివాహాల నివారణ

- వలసల నివారణకు ప్రత్యేక చర్యలు
- చదువు ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన
- నీతి అయోగ్ సమావేశంలో జిల్లా కలెక్టర్ సృజన





ప్రధాని నరేంద్ర మోదీకి కర్నూలు జిల్లా పరిస్థితులను వివరిస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల సహకారంతో బాల్య వివాహాలను నివారిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన నీతి అయోగ్ సమావేశాల్లో దక్షిణాది రాష్ట్రాల నుంచి హాజరైన కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కర్నూలు జిల్లాలోని పరిస్థితులను వివరించారు. జిల్లాలోని హొళగుంద, మద్దికెర, చిప్పగిరి ప్రాంతాల్లో 70 శాతం మంది ప్రజలు సీజనల్‌గా వలస వెళ్తున్నట్లు గుర్తించి, నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. నిరక్షరాస్యత అధికంగా ఉండడంతో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, ఈ ఆర్థిక సంవత్సరంలో 60 బాల్య వివాహాలను నిలిపివేసినట్లు చెప్పారు. చదువు ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు వివరిస్తున్నామన్నారు. పదో తరగతిలో 90 శాతం మార్కులతో పాసై వ్యవసాయ కూలీగా మారిన హొళగుంద మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన నిర్మలను ఇంటర్‌లో చేర్పించినట్లు చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో 11 వేల మందిని పాఠశాలలకు రప్పించినట్లు చెప్పారు. వలస వెళ్తున్న విద్యార్థుల కోసం 71 సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్తహీనత నివారణకు కోసం బాలికలకు ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు, ఐరన్, న్యూట్రీషన్ ఇచ్చినట్లు చెప్పారు. విద్యా కానుక , అమ్మఒడి తదితర పథకాలతో విద్యార్థులు పాఠశాలలకు వస్తున్నారన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలు వర్తించాలంటే కచ్చితంగా పదో తరగతి పాసు అవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిబంధన పెట్టడంతో బాల్యవివాహాలకు అడ్డుకట్ట పడుతోందన్నారు.

కుమారుడు మాట వినడం లేదని..



మృతి చెందిన షేక్‌ఫాతిమా

డోన్ రూరల్: కుమారుడు మాట వినడం లేదని ఓ తల్లి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఓబులాపురం గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ గోపాల్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్షావలి, షేక్ ఫాతిమా(38) దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పెయింటర్‌గా, చిన్న కుమారుడు 8వ తరగతి చదువుతున్నాడు. పెద్ద కుమారుడు తమ మాట వినడం లేదని షేక్ ఫాతిమా బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం నిమిత్తం కుటుంబీకులు అప్పగించారు. మృతురాలి భర్త షేక్షావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ఐచర్ వాహనం ఢీకొని ఇద్దరు కూలీల మృతి



మృతిచెందిన లాల్‌బాషా, సాయి శశాంక్

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి గ్రామ సమీపంలో గురువారం జరిగిన ప్రమాదంలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. డోన్ పట్టణం కొండపేటకు చెందిన లాల్ బాషా (26), బేతంచెర్ల పట్టణానికి చెందిన నీలకంఠం, లక్ష్మీదేవి కుమారుడు సాయి శశాంక్ (18), శివాజీ అనే కూలీలు పనికి వెళ్లేందుకు పీఆర్ పల్లి వద్ద రోడ్డు పక్కన నిలబడి ఉన్నారు. అదే సమయంలో వేగంగా వచ్చిన ఐచర్ వాహనం కూలీల పైకి దూసుకురావడంతో సాయి శశాంక్, లాల్ బాషా తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను డోన్, కర్నూలు ప్రభుత్వాసుపత్రులకు తరలించగా కోలుకోలేక మృతి చెందారు. లాల్‌బాషకు భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ఐరన్‌గల్లు చర్చిలో రూ.10 లక్షల చోరీ



డాగ్, క్లూస్ టీమ్‌తో దర్యాప్తు చేస్తున్న పోలీస్ సిబ్బంది

కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామంలోని చర్చిలో రూ.10 లక్షలు దోచుకెళ్లినట్లు ఆ చర్చి సంఘం పెద్దలు గురువారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ.. చర్చి అభివృద్ధికి దాతలు ఇచ్చిన రూ. 10లక్షల నగదును బుధవారం రాత్రి చర్చిలోని బీరువాలో భద్రపరిచామన్నారు. రాత్రికి రాత్రే దొంగలు చర్చి తలుపులు పగలగొట్టి బీరువా తలుపులు తెరచి నగదును దోచుకెళ్లారన్నారు. సంఘం పెద్దల ఫిర్యాదు మేరకు కోసిగి ఎస్‌ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కర్నూలు నుంచి డాగ్, క్లూస్ టీమ్ రప్పించి దర్యాప్తు చేపట్టారు.

పరిశోధన ఫలాలు రైతులకు అందిస్తున్నాం

- ఆంగ్రో వీసీ డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మి



డాక్టర్ శారదా జయలక్ష్మికి మొక్కను అందిస్తున్న డాక్టర్ కేఎస్‌ఎస్ నాయక్

మహానంది: వరి వంగడాలు, వేరుశనగ, చెరకు, చిరుధాన్యాల సాగుపై చేసిన పరిశోధన ఫలాలను రైతులకు చేరేలా కృషి చేస్తున్నామని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్, ఎక్స్ అఫీషియో చైర్మన్ ఆఫ్ ది బోర్డు మేనేజ్‌మెంట్ డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మీ పేర్కొన్నారు. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో గురువారం బోర్డు మేనేజ్‌మెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక, వ్యవసాయ పరిశోధనా స్థానాల ద్వారా రైతులకు అందించి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. పరిశోధనలకు సాంకేతిక పరిజ్ఞానం తోడవడంతో పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఆంగ్రో పరిధిలో ఏడు కళాశాలలు, మరో ఆరు అనుబంధ కళాశాలలతో పాటు ఇంజినీరింగ్, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలు ఉన్నాయన్నారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బోర్డు మెంబర్లు డాక్టర్ కోదండరామిరెడ్డి, డాక్టర్ పీవీ సత్యగోపాల్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కేఎస్‌ఎస్ నాయక్, అధ్యాపకులు డాక్టర్ ఎంఎస్ రాహుల్, డాక్టర్ గీతా శిరీష, తదితరులు పాల్గొన్నారు. శారదా జయలక్ష్మీ 1998 నుంచి పదేళ్ల పాటు మహానంది వ్యవసాయ కళాశాలలో తెగుళ్ల సస్యరక్షణ (పాథాలజీ) విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. వీసీ స్థాయిలో కళాశాలకు వచ్చిన ఆమె ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని అక్కడి వారితో పంచుకున్నారు.

సృజనాత్మకత పెంపొందించేందుకు బాలోత్సవాలు

- ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నంది బాలోత్సవాలను నిర్వహిస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో నంది బాలోత్సవ కార్యక్రమాన్ని ఎంపీ, ఎమ్మెల్సీ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంది బాల ఉత్సవాలకు జిల్లా కేంద్రం నంద్యాల వేదిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల్లో ఉన్న కళలు, నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహద పడుతుందన్నారు. ఆటాపాటలు, క్విజ్‌పోటీల ద్వారా సామాజిక స్పృహ పెరుగుతుందన్నారు. మొదటి రోజున క్లాసికల్ డ్యాన్స్, ఏకపాత్రాభినయం, వేషధారణ, చిత్రలేఖనం, వ్యాసరచన, పాటల పోటీలు, కూచిపూడి, జానపదం తదితర పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, బాబన్, శ్రీకాంత్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, బాలోత్సవం ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నాగేష్, గౌరవ సలహాదారు శంకరయ్య, కార్యదర్శి రామరాజు, శేషయ్య, కన్వీనర్ బి.రామరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మౌలాలి, గురుస్వామి, క్రాంతికుమార్, నాగరాజు, మాణిక్యం, ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసాద్, గోపాల్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

ఆళ్లగడ్డ: మున్సిపల్ పరిధిలోని చింతకుంట గ్రామంలో ఓ బాలుడు ఏడేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికను ఎవ్వరూ లేని ప్రదేశానికి తీసుకెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వాహబ్ తెలిపారు.

మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారిని సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు పోటాపోటీగా జరిగాయి. 11 డైరెక్టర్ పోస్టులకు ఎన్నికలు జరుగగా అన్నింటికీ పోటీ ఏర్పడింది. గూడూరుకు చెందిన ఆర్.శ్రీనివాసులు ప్యానల్ ఎన్నికల్లో విజయం సాధించింది. సహకార శాఖకు చెందిన అసిస్టెంటు రిజిస్ట్రార్ బి.రామకృష్ణయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గురువారం బంగారుపేటలోని జిల్లా మత్స్యశాఖ డీడీ కార్యాలయంలో మొదట డైరెక్టర్ల ఎన్నికలు జరిగాయి. డైరెక్టర్లుగా అనకల తిమ్మయ్య, బి.నగేష్, బి.మద్దిలేటి, వెంకటేశ్వర్లు, నంద్యాల చెంచులన్న, ఇ.భాస్కర్, మల్లేశ్వరుడు, టి.పెద్దవీరేష్, పి.శేఖర్, వై.నాగేషు, ఆర్.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల అధికారి రామకృష్ణయ్య ఆధ్వర్యంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా పెద్దకడుబూరు మండలం చిన్నతుంబళం గ్రామానికి చెందిన పెద్ద వీరేష్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసులు మాట్లాడుతూ... జిల్లాలోని మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కోవిడ్‌కు భయపడాల్సిన పనిలేదు



డాక్టర్ జి.మల్లికార్జున్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కోవిడ్ జేఎన్–1 వైరస్‌కు భయపడాల్సిన పనిలేదని జిల్లా క్షయ నియంత్రణ కేంద్రం మెడికల్ ఆఫీసర్, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు డాక్టర్ జి.మల్లికార్జున్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఇటీవల కాలంలో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న ఈ వైరస్‌తో పెద్ద ప్రమాదమేమీ కాదన్నారు. సాధారణ జలుబు, దగ్గు, స్వల్ప జ్వరంతో ఇది వస్తుందన్నారు. మరికొందరికి ఈ లక్షణాలతో పాటు ఆయాసం కూడా ఉంటుందన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యులను కలిసి పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధినిర్ధారణ అయితే హోమ్ ఐసోలేషన్‌లో ఉండి వైద్యులు సూచించిన మందులు వాడాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మరో ఇద్దరికి పాజిటివ్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చికిత్స కోసం వచ్చిన వారిలో మరో ఇద్దరికి గురువారం కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. ఇందులో ఒకరు ఎన్‌టీఆర్ బిల్డింగ్, మరొకరు కృష్ణారెడ్డి నగర్ వాసిగా ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. రెండు రోజుల్లో కోవిడ్ పాజిటివ్ బాధితుల సంఖ్య మూడుకు చేరింది.